క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితుడు శ్రీనివాసాచార్యులు

రామభద్రపురం: మండలంలోని బూసాయవలసలో భూలీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్త కోరాడ వెంకటరావు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు.వేదపండితుడు శ్రీనివాసా చార్యులు స్వామి వారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 29 మంది ఎంపిక



వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సృజనా విద్యాలయం, ప్రభావతి జాగృతి ట్రస్టు సంయుక్తంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 62 మంది కంటి రోగుల కళ్లను పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అయితే వీరిలో 29 మంది కంటి శుక్లాల ఆపరేషన్ కోసం ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సృజనా విద్యాలయ కరస్పాండెంట్ ఎ.జనార్దన రావు, క్యాంపు కో–ఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ మరమ్మతులు



విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

వంగర: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు గురువారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఏఈ కోనూరు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన ప్రొటెక్షన్ వింగ్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టారు. అనంతరం ఎం.సీతారాంపురం, మద్దువలస, అరసాడ ఫీడర్‌లలో విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు తరలింపు



వ్యాన్‌లో స్టూడెంట్ కిట్లు తరలిస్తున్న అధికారులు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన బుక్స్ స్టాక్ పాయింట్ దగ్గర నుంచి మండలంలోని వాడాడ, పాల్తేరు, గొల్లాది, బాడంగి క్లస్టర్ల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు తరలించారు. గురువారం పాఠశాలల పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఈ కిట్లు పంపించినట్లు అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన తొలిరోజే ఈ కిట్లు అందజేయడం విశేషం.

‘వెలుగు’లో ఆడిట్



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిటర్లు

వంగర: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఆడిట్ నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన పలువురు ఆడిటర్లు వంగర ఎంఎంఎస్ పరిధిలో ఉన్న గ్రామైక్య సంఘాల పరిధిలో నిధుల వినియోగంపై ఆడిట్ చేశారు. నగదు పుస్తకం, తీర్మానం పుస్తకం, లోన్ లెడ్జరీ, సాధారణ ఆవర్జ, డీసీబీ, రశీదు పుస్తకంతో పాటు పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం మీసాల చక్రపాణి, సీసీలు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు కల్పన



పిరిడి జూనియర్ కళాశాల అధ్యాపకులకు సూచనలిస్తున్న విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు కల్పన

బొబ్బిలిరూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు కల్పన సూచించారు. మండలంలోని పిరిడి గ్రామంలో ఉన్న జూనియర్ కళాశాలలో ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు తదితర అక్కడి సదుపాయాలను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం అక్కడి అధ్యాపకులతో సమావేశమై, గత ప్రభుత్వం విశాలమైన పాఠశాల ఆవరణలో అన్ని వసతులతో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇదే పాఠశాలలో పదో తరగతి చదివి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి, వారు ఇక్కడి కళాశాలలో చేరేలా వారి తల్లిదండ్రులను చైతన్యం చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సదుపాయాలు సమకూర్చడంతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించాలన్నారు. అక్కడి నుంచి బొబ్బిలి వెళ్లి, అక్కడి బుక్స్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించి, పలు సూచనలు చేశారు. సకాలంలో పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు సరఫరా చేయాలని, విద్యార్థులకు వెంటనే వాటిని అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో చల్లా లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం లక్ష్యాలను చేరుకోవాలి



ఉపాధి సిబ్బందితో సమావేశమైన ఎంపీడీఓ రవికుమార్

బొబ్బిలిరూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కల పెంపకానికి సంబంధించిన లక్ష్యాలను చేరుకోవాలని ఉపాధి హామీ పథకం సిబ్బంది, అధికారులకు ఎంపీడీఓ పి.రవికుమార్ సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చెరువు గట్లపై కొబ్బరి మొక్కలు నాటించాలని ఆదేశించారు. అలాగే ఆసక్తి ఉన్న రైతులకు ఉద్యాన,వాణిజ్యరకాలైన టేకు, మామిడి, జామ, పామాయిల్ వంటి మొక్కలను పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా,ప్రధాన కూడళ్లలో నీడనిచ్చే వేప,చింత,కానుగ,తురాయి వంటి మొక్కలు నాటించాలని చెప్పారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



రంగప్పవలసలో చెరువు గట్టుపై కొబ్బరి, టేకు మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

తెర్లాం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని రంగప్పవలస గ్రామ సర్పంచ్ శనపతి రాంబాబు అన్నారు. గ్రామంలోని రెండు చెరువుగట్లపై గ్రామస్తులతో కలిసి గురువారం కొబ్బరి, టేకు, పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఆరు చెరువు గట్లపై ఇప్పటికే 200 కొబ్బరి మొక్కలు, సుమారు 1,500 టేకు మొక్కలు నాటామని, వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలోని మరో రెండు చెరువుగట్లపై కొబ్బరి, టేకు, పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. చెరువు గట్లపై కొబ్బరి మొక్కల పెంపకం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరుతుందని చెప్పారు.

ఎరువులు తయారు చేయండి



చెత్త సంపద కేంద్రంలో క్లాప్‌మిత్రలకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో ఎరువులు తయారు చేయాలని క్లాప్‌మిత్రలు, కార్యదర్శులకు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గడిముడిదాం గ్రామంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని గురువారం పరిశీలించిన ఆయన.. ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను ఉపయోగించి, ఎరువు తయారు చేసి, రైతులకు అందజేయాలని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగుకాలువల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయాలని తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి



ప్రార్థన సమయానికే బూరాడ యూపీ పాఠశాలను సందర్శించిన ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎంఈవో ఎం.వి. ప్రసాదరావు సూచించారు. మండలంలోని బూరాడ, చిన్నశిర్లాం ప్రభుత్వ పాఠశాలలను ఆయన గురువారం పరిశీలించారు. వేసవి సెలవుల అనంతరం గురువారం పునఃప్రారంభమైన పాఠశాలలను పలు గ్రామాల్లో ఆయన సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చూడాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. ఎక్కడైనా డ్రాపౌట్స్ ఉంటే వారి ఇళ్ల వద్దకు వెళ్లి, తల్లిదండ్రులతో మాట్లాడి, వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చైతన్యం చేయాలన్నారు.

పండ్లతోటల పెంపకానికి ముందుకురావాలి



తాటిపాడులో వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీవో హరనాథ్

రేగిడి: సన్న, చిన్నకారు రైతులంతా పండ్లతోటల పెంపకానికి ముందుకురావాలని ఏపీవో ఎస్.హరనాథ్ కోరారు. మండలంలోని తాటిపాడు గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పలు పండ్లతోటల మొక్కలు అందిస్తున్నామన్నారు. ఇప్పటికే తోటలు పెంచుతున్న రైతులు చెట్లు మొదళ్ల చుట్టూ కందకాలు తవ్వుకునేందుకు ఉపాధి హామీ పథకం పనులను ఉపయోగించుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని వేతనదారులకు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాజాంలో క్లోరినేషన్ చర్యలు



లోతట్టు ప్రాంతాల్లోని మురుగునీటి నిల్వల వద్ద బ్లీచింగ్ వేయిస్తున్న అధికారులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని వాసవీనగర్, గాంధీనగర్, బాబానగర్ తదితర వార్డుల్లో గురువారం క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. ఔట్‌డోర్ శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా తాగునీటి బోర్లలో బ్లీచింగ్ వేయించారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో ఆయా వార్డుల్లోని లోతట్టు ప్రాంతాల్లో మురుగ నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై పట్టణవాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాడంగి: మండలంలోని గజరాయునివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ టి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎరుకులపాకలు, తెంటువలస, పిండ్రంగివలస, వీరసాగం, డొంకినవలస, పిన్నవలస, కోడూరు, అచ్చియ్యపేట, గొల్లలపేట, బ్రహ్మన్నవలస గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ సరఫరా ఉండదని,వినియోగదారులు తమ శాఖసిబ్బందితో సహకరించాలని కోరారు.

బొబ్బిలి డివిజన్ పరిధిలో..

బొబ్బిలి: స్థానిక డివిజన్ పరిధిలోని 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ బలిజిపేట ఫీడర్ మధ్య ఉన్న విద్యుత్ లైన్లను సరిచేసే పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఆవాల అనంతరావు గురువారం తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటలవరకు బలిజిపేట, పిరిడి, వంతరాం, నెమలాం, పినపెంకి సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు, అలాగే పట్టణపరిధిలోని పూల్‌బాగ్,మహారాణిపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజాం సిటీ: మండలంలోని గురవాం ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ వి.సురేష్‌కుమార్ గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో గురవాంతో పాటు రేగిడి మండలంలోని బాలకవివలస, మునకలవలస గ్రామాలకు ఈ అసౌకర్యం కలగనుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బూరాడ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏడీఈ ఫణీంద్రకుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బూరాడ, లచ్చారాయపురం, నాయిరాలవలస, తునివాడ, వెంకంపేట, ఉణుకూరు, ఒప్పంగి, పెదశిర్లాం, పనసలవలస, పారంపేట, ఎం.డోలపేట తదితర గ్రామాలకు ఈ అసౌకర్యం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

17న వెదుళ్లవలసలో నేత్ర వైద్యశిబిరం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో ఈనెల 17న ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మాన వీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు గురువారం తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్, మానవీయతా స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈశిబిరంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది సేవలందిస్తారని పేర్కొన్నారు. వెదుళ్లవలసతో పాటు సమీప గ్రామాలకు చెందిన నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయిస్తామని చెప్పారు.

భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు



రాజాం మెయిన్‌రోడ్డు మీదుగా వెళ్తున్న భారీ లారీ

రాజాం: పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పెద్దపెద్ద ట్యాంకర్లు తరచూ వస్తుండడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. శ్రీకాకుళం రోడ్డు నుంచి బొబ్బిలి సెంటర్ మీదుగా రామభద్రపురం వైపు ఈ వాహనాలు వెళ్తున్నాయి. రెండు రోజుల క్రితమే ఓ భారీ ట్యాంకర్‌ను తీసుకుని రాజాం మీదుగా 42 చక్రాల లారీ ప్రయాణించగా, 58 టైర్లు కలిగిన మరో వాహనం ఓ పెద్ద ట్యాంకర్‌ను తరలిస్తూ గురువారం ఇలా కనిపించింది.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న ఎస్.వి.రమణ

రేగిడి: ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం, ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండడం, సామాజిక సేవ చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. మండలంలోని వావిలవలస రామాలయంలో గ్రామానికి చెందిన వారణాసి జగన్నాథ స్వామి ఆధ్వర్యంలో గురువారం ఆధ్యాత్మిక దివ్య మహాసభ నిర్వహించారు. ముందుగా పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ఎస్.వి.రమణ మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని, ఆపదలో ఉన్న సాటి మనిషికి సహాయ పడాలని సూచించారు. దేవుదలకు చెందిన గొర్లె దామోదర రావు, దశమంతుపురం గ్రామానికి చెందిన సతివాడ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ‘ఉపాధి’ పనులు



రాజాం సిటీ: బొమ్మినాయుడువలసలో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీవో సాయిరాం



రేగిడిలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు



వంగర: మద్దివలస సాగునీటి కాలువలో పనులు చేస్తున్న దృశ్యం



తెర్లాం: కూనాయవలస ఉపాధి పనులకు హాజరైన వేతనదారులు

రాజాం సిటీ/రేగిడి/వంగర/తెర్లాం: మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నాయి. రాజాం మండలంలోని బొమ్మినాయుడువలస సీతమ్మ చెరువు, గార్రాజుచీపురుపల్లి చిన్నయ్య చెరువులో జరుగుతున్న పనులను ఏపీవో కె.సాయిరాం, రేగిడి మండలంలో జరుగుతున్న పనులను ఏపీవో ఎస్.హరనాథ్, వంగర మండలంలోని కె.కొత్తవలస, ఎం.సీతారాంపురం గ్రామాల్లో జరుగుతున్న పనులను అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్లు గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎండలు ఎక్కువగా ఉంటే రెండు పూటలా పనిచేయాలని, వర్షం వచ్చే సూచనలుంటే వెంటనే ఇళ్లకు వెళ్లిపోవాలని తెలిపారు. వడదెబ్బ బారినపడకుండా పనిప్రదేశంలో టెంట్లు వేసుకోవాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



అవగాహన కల్పిస్తున్న పీఆర్‌పీ రమాదేవి

రేగిడి: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని, సేంద్రీయ ఎరువులతో పంటలను సాగు చేసి మంచి దిగుబడులు సాధించవచ్చని ప్రకతి వ్యవసాయ పీఆర్‌పీ రమాదేవి అన్నారు. గుళ్లపాడు క్లస్టర్ పరిధిలోని వండానపేట, కె.ఎం.వలస గ్రామాల రైతులకు, స్వయం శక్తి సంఘాల మహిళలకు ప్రకతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విచ్చల విడిగా రసాయన ఎరువులు వినియోగిస్తుండడం వల్ల క్రమంగా భూసారం తగ్గిపోతోందని, తెగుళ్ల ఉధృతి ఎక్కువైపోతోందని అన్నారు. ఆవుపేడ గత్తం, గొర్రె గత్తం, ఘన, ధన జీవామృతాలుచ కషాయాలు వంటివి వినియోగించి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల జీవ వైవిధ్యం బాగుంటుందన్నారు. ఎస్‌డీఏ జె.అప్పలనాయుడు, ఐసీపీ కె.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పునఃప్రారంభం



బాడంగి గురుకుల పాఠశాల పరిసరాల్లోని పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం



రామభద్రపురంలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

రామభద్రపురం/బాడంగి: మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం తొలిరోజు పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపించారు. మొదటిరోజు తరగతులు అంతగా జరగకపోవడంతో పిల్లలంతా సెలవుల్లో గడిపిన ఆనంద క్షణాలను ఒకరినొకరు పంచుకుని, ఆనందం వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు.